# పేచీ

**ఆదినారాయణ :**

ఆ రోజు ఆదివారం. అలవాటుగా పదిగంటలకే భోజనం ముగించి చెయ్యి తుడుచుకుంటూ వీధిలోకి వచ్చాడు.

'ఇక్కడ ఏదైనా గది దొరుకుతుందాండీ' అంటూ వో యువకుడు గిరిని అడుగుతున్నాడు. అమాయకమైన మొగం. కొత్త బెదురు. ఇంకా తండ్రిచాటు బిడ్డ వాలకం. దగ్గరకు పిలిచి పేరూ వూరూ అడిగాను.

వెంటనే చొక్కా వేసుకునివెళ్లి నాలుగిళ్ళవతల సుందరమ్మ గారింట్లో గది ఇప్పించాను. ఆరుగురు కొడుకులుండీ అరవై ఏళ్ళ సుందరమ్మగారు బ్రహ్మచారులకు గదులిచ్చి, దానితో పొట్ట గడుపుకొంటూంది.

ఆ యువకుని పేరు హరిప్రసాదు. తండ్రి పల్లెలో వ్యవసాయం చూసుకుంటున్నాడు. ఇద్దరు కొడుకులు, ఇద్దరుకూతుళ్ళలో ఇతడేచివరివాడు. ఇవీ నేను ఇంటికి వెళ్ళేలోగా తెలుసుకున్న వివరాలు. సాయంత్రం ఇంటికి రమ్మని చెప్పాను.

హరిని చూస్తూనే 'చెక్కిన బొమ్మలాగ వున్నాడండీ కుర్రాడు' అంది నా ఇల్లాలు.

పిల్లలందర్నీ పరిచయంచేశాను. కాఫీ ఇచ్చి అప్పుడప్పుడూ వస్తూండమని చెప్పాను.

'మొహమాటపడకు బాబూ. మీ ఇల్లొకటీ ఇదొకటీ కాదు. వస్తూండు' అంది నా ఇల్లాలు.

ఉద్యోగంతోపాటు ఈ వూరూ, మా ఇల్లూ అన్నీ హరికి అలవా

టయిపోయాయి. తరచు వచ్చి పిల్లలతో పచ్చీసు, పేక ఆడేవాడు. గిరిగాడికి తెలియని పాఠాలు చెప్పేవాడు. వనజతో అరమరిక లేకుండా కబుర్లు చెప్పేవాడు. కొలవురోజుల్లో నా సరసన భోజనం చేసేవాడు.

రోజురోజుకీ ఆర్థిక ఇబ్బందులు ఎక్కువవుతున్నాయి. వెనక ఆసరా లేనివాడ్ని, వనజకు పెళ్ళెలాచేయను ? గిరిగాడు నాకెప్పటికి అందివస్తాడు! పిల్లలు నలుగురు, పెద్దవాళ్ళమిద్దరం. రెండుపూట్లా తిండికే చాలటంలేదు — పిల్లల కొాక జీవనమార్గం ఎలా చూపించను?

ఇటువంటి మానసిక స్థితిలో వున్నప్పుడు, ఒకరోజు హరితో మాటవరసకి అన్నాను.

'ఎలాగోలా మా వనజ పెళ్ళి చేసేస్తినా రోజుకి సోలడు బియ్యం మిగులు. ఈ కరువురోజుల్లో ఎంత తగ్గినా తగ్గినట్టే.'

హరి మొగం అదోలా పెట్టేశాడు.

ఏమిటండీ మరీ అలా మాటాడుతారు. మీబిడ్డ మీకు అంత బరువా? హృదయగత సంబంధాలు అణాపైసలలోకి మార్చేశారు ! చాలా దారుణం సుమండీ' అన్నాడు.

హరి అలా అనేసరికి నా ప్రాణం చివుక్కుమంది. నా మాటను సమర్థించుకోవలసిన బాధ్యత కనిపించింది.

'నువ్వింకా చిన్నవాడివయ్యా ! సంసార సాగరంలోని ఆటుపోట్లు నీకు తెలియవు. కడుపు నిండాకే సంబంధాలూ, బాంధవ్యాలూను. ఆకలికి ఆగలేని పిల్లి తన పిల్లలనే తింటుందట. ప్రకృతిలో తన సంతానాన్ని కబళించే జంతువులూ వున్నాయి' అన్నాను. అనుకోకుండా విషయం సీరియస్ అయింది.

'కాని మనం మానవులం. బుద్ధి జీవులం గదండీ'

'అందుకే గదయ్యా పాతికేళ్ళపాటు కన్నవాళ్ళమీద చేరబడి

బ్రతుకుతున్నాం' అన్నాను. హరి మాట్లాడలేదు, ఈ సంభాషణ అతనికి నచ్చలేదని మాత్రం అర్థం అయింది.

రోజులు గడుస్తున్నాయి. వనజ పెళ్ళిబాధ దాని తల్లి రూపంలో నన్ను తొలుస్తోంది. ఒకరోజు కబుర్లు చెప్పుకుంటున్న హరినీ, వనజనూ చూసేసరికి ఏదో ఆశ కలిగింది. వాళ్ళిద్దరూ ప్రేమించుకుంటే బావుండును అని అనిపించింది.

'ప్రేమ' అనేదే తప్పు అనే స్థితి నుండి 'ఫలానివాడ్ని మాత్రమే ప్రేమించాలి' అని అనుకోడంలో ఈ పెద్దలు ఎదిగారా ? దిగారా ?

కాని హరి చాలా అమాయకుడు. సరదాకయినా కొంటె పనులు చేయనివాడు. అలాంటివాడు ప్రేమపాఠాలు వల్లించడం, ఆడపిల్లను తాకగల్గడం కలలోని మాట. పోనీ మా పిచ్చి మొద్దు ఏమయినా ఆకర్షించే పద్ధతు లవలంబిస్తుందా అంటే-అబ్బే ఆడది పతివ్రత ఎప్పుడయిందో అప్పుడే శృంగార చేష్టలన్నీ పాతరవేసేసింది. కులమింటి కోతి అయి కూర్చుంది. నా కూతురు ఇందుకు భిన్నంకాదు.

అరచేతిలో వస్తువు పెట్టుకుని వూరంతా తిరగడం నా చేతకాదు. సంకల్పం, సాహసం లేకపోతే జీవితంలో ఏం చేయగలం ? అందుచేత నేనే చిన్న పేచీ వేసాను.

**హరివ్రసాదు :**

ఆ చూపుకి వులిక్కిపడ్డాను. అప్పటికి గంట నుండీ నేనూ, వనజా అలా కూర్చుని కబుర్లు చెప్పుకుంటూనే వున్నాము. చీకట్లు కమ్ముకొస్తున్నా కబుర్లలో పడిన మాకు తెలియలేదు. నాకా ఇంటితో పరిచయమయిన ఏడాదినుండి అలా వచ్చి అందరితోనూ కబుర్లు చెప్పడం అలవాటే. అలాంటప్పుడు ఆదినారాయణ గారెందుకు అదొకరకంగా చూస్తూ లోపలికి వెళ్ళిపోయారు ? నన్ను పలకరించకుండా, వనజను రమ్మన

కుండా ఇద్దరిపక్కా అలా చూశారేమిటి ?

అసలు నాకు కుటుంబంతో పరిచయం చేసినవాడాయనే. నివా సానికి గదినిప్పించీ తన ఇంటిని అలవాటు చేసింటీయనే. ఇంకా కుర్ర తనం వదలని నేనూ వాళ్ళతో కలసి ఆడుకొనే వాడ్ని.

అలాంటివాడు ఇవాళ అలా చూశాడేమిటి ? ఆ చూపుకి బిక్క చచ్చిపోయి కూచుండిపోయిన వనజ మాటాడకుండా లేచి లోపలికి వెళ్ళి పోయింది. నాకేంచేయాలో తోచలేదు. చెప్పి వెళదామంటే మనుషులెవరూ కనిపించలేదు. ఇల్లంతా నిశ్శబ్దమయిపోయింది. లోపలికివెళ్ళి చెప్పే సాహసం లేక మెల్లగా బయటకు అడుగు పెట్టాను.

ఆ చూపు నన్ను వెంటాడుతూనే వుంది. మనసు మనసులో లేదు. ఆందోళన కమ్ముకుంది. ఏం తప్పు చేశాను ?

ఎంత ఆలోచించినా నేనుచేసిన ఏ తప్పూ స్ఫురించలేదు. మరేమిటి ? అందరూ కాఫీలకు వంటగదిలోకి చొరబడటంతో ఆ క్షణాన నేనూ వనజా మిగిలాము. వనజా నేనూ కబుర్లు చెప్పుకోవడం ఈనాడు కొత్తగాదు. నాకు తెలిసి నేనేమీ అసభ్యంగా ప్రవర్తించడం గానీ, అమర్యాదగా మాట్లాడడంగానీ చేయలేదు. నాకు తెలీకుండా ఏమన్నా చేశానా ? అలాచేస్తే పెద్దవాడుగదా పిలిచి చెప్పొచ్చుగా. ఆ విధమయిన ఆయన బాధ్యతను, నాకు గది ఇప్పించిన్నాడే అంగీకరించాను. నవ్వు తూనో, వేళాకోళంగానో, తీవ్రంగానో ఎలా చెప్పినా నేను అర్థంచేసుకో గలనేగాని అర్థం చేసుకోలేని మూర్ఖుడ్నిగాదే. లేదా తిప్పికోప్పడగల పొగరు మోతునుగాదే. మరెందుకాయన ఈ ప్రక్రియలన్నీ వొదిలేసి అటువంటి చూపుచూశాడు. లేక అది నా భ్రమా ! ఏదో చికాకులో వుండి చూస్తేనూ, మాట్లాడక పోతేనూ అది నా కన్వయించు కున్నానా? ఇది మరింత నవ్వుచేటు.

నాకు తెలిసి నేనేమీ తప్పుచేయలేదు. తెలియకుండా ఏదయినా చేశానేమోననే భయంతో, బాధతో నా అలవాటుకు భిన్నంగా వారింటికి పోకపోతే నామీద అపవాదు భావం ఇంకా బలమౌతుంది. తప్పుంటే ఆయనే చెబుతాడు.

వారం రోజులపాటు మథనపడి ఈ రకమైన నిర్ణయానికి వచ్చి ఆ రోజు సాయంత్రం మామూలుగా ఆదినారాయణ గారింటికి బయలు దేరాను.

వాకిట్లో చెప్పులుంచి గుమ్మం దాటానో లేదో లోపలి నుండి ఆది నారాయణగారి గొంతు కంచు గంటలా వినిపిస్తోంది.

చూడుతల్లీ, అస్తమానూ ఆ అబ్బాయితో కూర్చుని కబుర్లు చెప్ప డానికి నువ్వు చిన్నపిల్లవు కాదు. లోకం గుడ్డిది. ఇదిగో తోక అంటే అదిగో పులి అంటుంది. లోకాన్నికాదని బ్రతకగలిగేంత ఆర్థికస్తోమత నాకు లేదు తల్లీ. నీకింకా లోకంపోకడ తెలీదమ్మా. మగవాడి మనసు అంతకంటె తెలీదు. ఆడపిల్ల పెళ్ళికి పవిత్రం, పడకకు జాణ కావాలం టాడు మగవాడు. నిన్న పక్కింటి నరసింహంగారు రోడ్డుమీద కనబడి ఏదో విసిరాడు. నేనేం చేయనుచెప్పు. ఈ తండ్రిని కనికరించి కొంచెం జాగ్రత్తగా వుండుతల్లీ. అతనికేం మగవాడు. ఎటుతిరిగి ఆడ పిల్లవు. నీకూ, నిన్నుగన్న మాకూనమ్మా.'

నాకాళ్ళకింద భూమి కదిలిపోయింది. నేనెందుకు బెదిరానో అదే నిజమయిందన్నమాట. నిశ్శబ్దంగా వెనక్కు తిరిగివచ్చి రోడ్డు ఎక్కాను. ఎదురుగా నరసింహంగారు నవ్వుతూ కనిపించారు. ఆయన మొఖం చూడలేక తల వంచుకుని గదిలోకి వచ్చిపడ్డాను.

ఇప్పుడేమిటి దారి ?

పాపం నా మూలంగా వనజ తిట్లుతింటోంది. ఆ అమ్మాయి

భవిష్యత్తు ఏమైపోతుంది ? ఏదో కొంచెం చొరవ ఇచ్చేరుగదా అని నిత్యం వాళ్ళింటిమీదికి వెళ్ళి ఆడపిల్లకోసం కాదంటే ఎవరయినా నమ్ముతారా ?

నా కేమీ అర్థం కావడంలేదు. నా ప్రవర్తన అంత ఎబ్బెట్టుగా నలుగురికీ కనిపించిందని తెల్సుకోలేకపోయాను.

ఆ మర్నాడు సాయంత్రం బజారులో తిరుగుతూంటే వనజ తల్లితో గుడికివెళ్తూ కనిపించింది.

'ఏంబాబూ ! కులాసాగావున్నావా కనిపించడం మానేశావ'ని పలకరించిన జయమ్మగారికి పరాకుగా సమాధానం చెపుతూ వనజను చూశాను. ఎప్పుడూ తనే చొరవగా ముందుకు వచ్చి పలకరించే వనజ తలవంచుకొని తల్లి వెనకాల వొదిగి నుంచుంది. నా మనసు కలుక్కు-మంది. ఏదో తప్పు చేసిన భావం, ఇద్దరిలోనూ ఏదో బెదురు.

వెళ్తూవెళ్తూ వెనక్కు వొక్కచూపు చూసింది. కళ్ళల్లో నీళ్లు. నన్ను క్షమించు అనే సందేశం. విలవిల్లాడి పోయాను.

నా మనసులోని ఈ బాధ ఏమిటి ? నాకు తెలీకుండా నేను ఆకర్షించబడ్డానా? స్త్రీ పురుషులకుండే సహజమయిన ఆకర్షణ తమపట్ల కూడా రుజువయిందా ? నాకు తెలియకుండానే అటువంటి ఆకర్షణ నన్న క్కడికి నడిపించేదా? ఆ భావానుభూతి పొందుతున్న తమకంటే చూస్తున్న ప్రేక్షకులకే సులువుగా అర్థమైందా? అదే నిజమయితే ఇప్పుడు వనజను వదిలివేయడం చాలా అన్యాయం. తమ భావానుభూతి బయటపడ్డాక ఎవరి కెవరూ కాదనుకోవడం బాధ్యతారాహిత్యం. ఎటువంటి ప్రేమపాఠాలూ వల్లించకపోయినా, మాట బయలుదేరిన తరువాత వనజను తన ఖర్మకు వదిలి నాదారి నేను చూసుకోవడం అమానుషం.

ఒక నిర్ణయానికి వచ్చాను.

**వనజ :**

ఈ నాటికి పెళ్ళయి మూడ్నెల్లవుతోంది. మా ఇద్దరిమధ్యా కొత్త ఇంకా పోలేదు. వారి పరిచయం చాలా రోజుల్నుండీ వున్నా బ్రతుకులో చనువు ఇంకా కలుగలేదు.

సాయంత్రం అవుతోందని స్నానంచేసి వచ్చి జడవేసుకున్నాను. బొట్టు పెట్టుకుంటూండగా తలుపు చప్పుడయింది. హరి లోపలకు వస్తూనే కుర్చీలో కూలబడి కళ్ళుమూసుకుని 'మంచినీళ్ళు' అన్నాడు. మంచినీళ్ళ గ్లాసు అందుకుంటూ ఎగాదిగా ముస్తాబు చూశాడు.

'మీ ఆడాళ్ళ అందాన్ని రోజూ పొగడుతుండాలట కదూ. లేకపోతే మీకు తృప్తి వుండదట, నిజమేనా ?' అన్నాడు.

వెలవెల బోయాను. ఏమిటీ మాటలు? పడుపుగత్తెను అడిగినట్లు ఏమిటీ ప్రశ్న ?

నేనేమీ మాట్లాడలేదు. కాని హరి లోలోపల ఏదో కుతకుత వుడుకుతోందని గ్రహించాను. ఏమిటది ?

నేను వంటింటిలోకెళ్ళి టీ తీసుకుని వచ్చేసరికి హరికి బదులు నాన్న కనిపించాడు. నేనడగా లనుకున్న ప్రశ్న ఆయనే అడిగాడు— 'అబ్బాయేడీ ?'

'ఆయన కోసమే టీ తెస్తున్నా. ఇంతలో ఎటు వెళ్ళారో.

నాన్న అస్థిమితంగా కదులుతూ 'అతనేమన్నా అన్నాడా ?' అని అడిగాడు. నాగుండె గతుక్కుమంది.

'ఏమిటనడం ?'

'అహ, మనిషి చికాగ్గాగాని కోపంగాగాని వున్నాడా? నిన్నేమన్నా అన్నాడా ?'

'ఎందుకు ?' నాన్న మింగలేని కక్కలేని పరిస్థితిలో వున్నాడు. ఏదో అదుర్దా కనిపిస్తోంది.

'అబ్బే ఏంలేదుగాని రేపాదివారం కదా, పొద్దున్నే మీరిద్దరూ అక్కడకు వచ్చేయండి. సాయంత్రం వరకూ వుండిపోదురుగాని. అతనితో కూడా చెప్పు.' అనేసి వెళ్ళిపోయాడు.

ఏం జరిగింది ? వీళ్ళిద్దరి ధోరణీ చూస్తూంటే ఏదో జరిగినట్లే వుంది. నాన్న అలా వెళ్ళగానే హరి వచ్చాడు. ఆయన్నుచూసే తప్పుకున్నాడని అనిపించింది. హరి తొందరగా తేలే మనిషికాదు. అందుచేత నేనే అన్నాను.

ఇప్పుడే నాన్నవచ్చి వెళ్ళాడు. రేపాదివారం కదా. పొద్దున్నే అక్కడికి వచ్చేయమన్నాడు.

'ఎందుకూ, పాపం మీ నాన్నకు కిలో బియ్యం ఖర్చు.' అన్నాడు వెటకారంగా. బద్దలయిన మౌనం ఆగలేదు. మెల్లగా బయట పడుతోంది.

'ఎదురింటి నరసింహంగారు పొడిచాడన్నాడు. పక్కింటి వెంకటచలం గొణిగాడన్నాడు.... నా ఇంట్లో పెళ్ళికావలసిన ఆడపిల్ల వుంది. రాకయ్యా అంటే వెంటబడతానా... లేక ఏమీ ఇచ్చుకోలేని పేదవాణ్ణి, నా కూతుర్ని చేసుకుంటావా అని మర్యాదగా అడిగితే కాదంటానా ?.... ఈ కుర్రవాళ్ళట తా మేమిటో తమకే తెలీని స్థితిలో వున్నారట. తమకేం కావాలో తాము నిర్ణయించుకోలేని స్థితిలో వున్నారట. చేసుకున్న నిర్ణయానికి కట్టుబడి వుండలేక పోతున్నారట....అందుకని పేచీ వేశాడట పేచీ అదీ-పబ్లిక్కు-పార్కులో నరసింహంగారితో చెప్పుతున్నాడు గొప్పగా. వీధెలాంటి ఎత్తులువేస్తే అలా ఆడడానికి నేనేమన్నా తోలుబొమ్మ ననుకున్నాడా ? మనుషుల మనసుల్తోనూ, బ్రతుకుల్తోనూ ఆటలాడతాడా ?...

ఇదుగో పనజా నీ కిప్పుడే చెబుతున్నాను. నీకు నాన్న, అమ్మ,పుట్టిల్లూ ఇవాళటితో సరి. నన్ను కాదని, నాకు తెలీకుండానయినా సరే ఆ గుమ్మంలోకి వెళ్లావో – ఆనాటితో నీకూ నాకూ సరి – గుర్తుంచుకో' అన్నాడు హరి.

గుండె గుభిల్లుమంది. నాకా ఈ శిక్ష! క్రమంగా అంతా అర్థమయే సరికి దిగాలుపడిపోయాను. 'పిల్లా పిల్లవాడూ ప్రేమలో పడ్డారనీ, గత్యంతరం లేక పెళ్ళి చేస్తున్నారనీ' పెళ్ళిలో చాలా మంది అనుకూంటూంటే నాన్న ముసిముసిగా నవ్వేవాడు. ఇందుకే నన్నమాట! నాన్న పేచీ బుర్ర కూతురు పెళ్ళి చేయడానికి యిలా ఉపయోగపడిందా? పోనీ పేచీ వేసినవాడు నోరుమూసుకు వూరుకోక పార్కులో నరసింహంగారితో చెప్పడమెందుకు, వెధవ గొప్ప. చుట్టూ చూసుకోకుండా ఆ మామ చెప్పడమూ, ఈ అల్లుడు వినడమూను, మధ్య నా నెత్తిన కుంపటి పెట్టారు. నేనేం చెయ్యాలి?

★